GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 319 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం : జులై-10-2024 | పేజీలు : 3

## చట్నీలో చిట్టెలుక..

- జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ క్యాంటిన్ నిర్వాకం




**టి మీడియా, జూలై 9,సంగారెడ్డి:** సంగారెడ్డి జేఎన్‌టీయూ కాలేజీ క్యాంటిన్‌లో ఎలుక కలకలం సృష్టించింది. సుల్తాన్‌పూర్‌లో ఉన్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ హాస్టల్‌లో ఉన్న క్యాంటీన్‌లో చట్నీ గిన్నెపై మూత పెట్టకపోవడంతో అందులో ఎలుక పడింది. అయితే చట్నీలో ఎలుక ఈదుతుండటాన్ని గమనించిన విద్యార్థులు క్యాంటిన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దానిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టుచేశారు. అయితే ఈ విషయం బయటకు చెప్పకూడదంటూ విద్యార్థులపై కాలేజీ యాజమాన్యం ఆంక్షలు విధించినట్లు తెలుస్తున్నది. ఈ ఘటనపై కాలేజీ ప్రిన్సిపల్ నరసింహ స్పందించారు. చట్నీలో ఎలుక పడలేదని చెప్పారు. శుభ్రం చేసేందుకు ఉంచిన పాత్రలో ఎలుక కనించిందని తెలిప్పారు. కొందరు విద్యార్థులు కావాలనే వీడియో తీసి ప్రజాప్రతినిధులకు పంపించారని ఆరోపించారు. గత నెల 24న కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ఇలాంటి ఘటనే చోటుచేసుకున్నది. విద్యార్థులు తినే ఆహారంలో పురుగులు దర్శనమివ్వడంతో ఆందోళనకు దిగారు. తాము రోజూ తినే ఆహారంలో పురుగులు వస్తుంటే యూనివర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వీసీ చాంబర్ ముందు ఆందోళన నిర్వహించారు.

# పాలుమూరుకు మహర్దశ




- 2025 లోగా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి
- రూ 396.09 కోట్లతో పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- సీఎం హెూదాలో తొలిసారి పాలమూరు రాక




**టి మీడియా, జూలై 9, మహబూబ్‌నగర్ బ్యూరో :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం హెూదాలో తొలిసారి మహబూబ్‌నగర్ జిల్లాలో మంగళవారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రూ. 396.09 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ. 42.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు, అలాగే రూ. 13.44 కోట్లతో ఎస్టీపీ భవనానికి, అకాడామిక్ బ్లాక్, గ్యాలరీ పనులకు, ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 10కోట్లతో బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు..

### దేవరకద్రలో డిగ్రీ కాలేజీ భవనం..

దేవరకద్రలో రూ. 6.1కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ రూరల్ లో రూ. 3.25 కోట్లతో చేపట్టనున్న కేజీవీబీ భవన నిర్మాణానికి, గండీడ్ లో రూ. 6.2 కోట్లతో కేజీవీబీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ. 37.87 కోట్లతో సీసీ రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ పనులకు, రూ. 276.80 కోట్లతో ఎస్టీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో యూనివర్సిటీ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

### మొక్కలు నాటిన రేవంత్

అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనమహెూత్సవం కార్యక్రమంలో పాల్గొని మహబూబ్ నగర్ కలెక్టరేట్ ఆలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం



నిర్వహించనున్నారు. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యంపై సమీక్షించనున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు కలెక్టర్లు, ఇతర అధికారులు సీఎం సమీక్షలో పాల్గొన్నారు. డిసెంబర్ 2025 లోగా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడంలో గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రాజెక్టు పనుల్లో పురోగతిని ప్రతి నెలా సమీక్ష నిర్వహించాలని చెప్పారు. నిర్ధేశిత గడువులోగా కల్వకుర్తి పూర్తి చేసే ప్రణాళికలో భాగంగా క్షేత్రస్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. మంత్రులు శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీ దామోదర రాజనర్సింహ శ్రీ జూపల్లి కృష్ణా రావు, తెలంగాణ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు శ్రీ చిన్నారెడ్డి సీఎం సలహాదారు శ్రీ వేం నరేందర్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో జిల్లాలో వివిధ పథకాల పురోగతి, తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో మొత్తంగా రూ. 396.09 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. మొదట కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించారు. అలాగే, పాలమూరు వర్సిటీలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికల హాస్టల్ నిర్మాణం, దేవరకద్రలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం, మహబూబ్‌నగర్ రూరల్ మరియు గండీడ్‌లో కేజీవీబీ భవనాల నిర్మాణం, మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ పనులు, ఎస్టీపీ నిర్మాణం వంటి కార్యక్రమాలకు సీఎం గారు శంకుస్థాపన చేశారు.

# పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పంప్ హౌస్ పనుల పరిశీలన



**టీ మీడియా, జులై 9, భద్రాద్రి కొత్తగూడెం:** సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ములకలపల్లి మండలం పూసగూడెం పంప్ హౌస్ ను మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మరియు మార్కెటింగ్ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ఐ,టీడీఏ పీవో రాహుల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పంపు హౌస్ లో చేపట్టిన పనుల వివరాలను మ్యాప్ ద్వారా మంత్రికి వివరించారు. ట్రైలర్ కు సిద్ధంగా ఉన్న మోటార్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంపు హౌస్ లో ఏర్పాటు చేసిన మోటర్లు చైనా షాంగై కంపెనీ రూపొందించినవని, చైనా నుండి ఆ కంపెనీ ఇంజనీర్లు రావాల్సి ఉందని వచ్చిన అనంతరం పంప్ హౌస్ యొక్క ట్రైలర్ నిర్వహిస్తామని తెలిపారు. అతి త్వరలో చైనా ఇంజనీర్లు రావడానికి భారత ప్రభుత్వం మరియు చైనా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నదని తెలిపారు. పంపు హౌస్ లో ఇరిగేషన్ మరియు ఎలక్ట్రికల్ పనులు అన్ని పూర్తి అయినవి తెలిపారు. మోటర్లు చైనా వి అయినందువలన వారి ఇంజనీర్ ల సమక్షంలో ట్రయల్ రన్ పూర్తి చేసుకొని, గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆగస్టు నెలలో గోదావరి జలాలను ఏన్కూరు లింకు కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్ కు తరలించడం అనేది రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇరిగేషన్ మంత్రి యొక్క కోరిక అని ఆయన అన్నారు. కృష్ణా జలాలు అనుకున్న సమయంలో శ్రీశైలం మరియు నాగార్జునసాగర్ కు రాకపోయినా వైరా ప్రాజెక్టు, సాగర్ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న ఆయకట్టుతోపాటు మధ్యలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటికీ గోదావరి జలాలను పంపించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం అని తెలిపారు. ఈ పంప్ హౌస్ లో పంపులు బిగించి నాలుగు సంవత్సరాలు పూర్తయినందువల న ఈ సంవత్సరం తప్పనిసరిగా ట్రయల్ రన్ పూర్తి చేయకపోతే పంపులకు కూడా ప్రమాదం ఉన్నదని నిపుణులు సూచించారని తెలిపారు. ట్రైలర్ త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జూలూరుపాడు టర్నల్ పూర్తి అయ్యే లోపు గోదావరి జలాలను వాడుకుంటూ పంప్ హౌస్ లను వినియోగంలోకి తీసుకురావాలని, అలాగే ఈ పంపులు చెడిపోకుండా చూసుకునే బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్నదని ఆయన తెలిపారు. ఏన్కూరు టర్నల్, లింక్ కెనాల్ ను అత్యవసర ప్రాతిపదిక పైన ముఖ్యమంత్రి అనుమతితో ఈ నెలలో పూర్తి చేయబోతున్నామని తెలిపారు. టర్నల్ వరకు 104 కిలోమీటర్ల కెనాల్ ను 97% పూర్తి అయిందని కేవలం మూడు శాతం లైనింగ్ పనులు మాత్రమే పెండింగ్లో ఉన్నవని అవి కూడా ఈ సీజన్ తర్వాత పూర్తి చేస్తామని తెలిపారు. గోదావరి జలాలతో ఈ మూడు పంప్ హౌస్ లను వినియోగించుకోవడంతోపాటు నాగార్జునసాగర్ ఆయకట్టు కి మీడియం ప్రాజెక్టులు అయినా వైరా లంక సాగర్ కు ఈ సంవత్సరం గోదావరి జలాలను తరలిస్తామని తెలిపారు. వచ్చే సీజన్ నాటికి యాతలకుంట టర్నల్ పనులు పూర్తి చేసి సత్తుపల్లి నియోజకవర్గంలో పాటు అశ్వరావుపేట నియోజకవర్గానికి కూడా నీరు అందిస్తామని తెలిపారు. 7800 కోట్ల రూపాయల ఖర్చుతో పంప్ హౌస్ నిర్మాణం చేపట్టామని వీటిని వినియోగం లోనికి తేవడం తో పాటు జూలూరు పాడు టర్నల్ పనులు పూర్తి చేసి గోదావరి జలాలను పాలేరు కు చేరుస్తామని తెలిపారు. అక్కడ మున్నేరు మీద ఆకేరు మీద టర్నల్ పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. అత్యవసరం అయినా జూలూరుపాడు టర్నల్ పనులు పూర్తి చేయాలని, పది కిలోమీటర్ల ఫారెస్ట్ అనుమతి తెచ్చుకోవాలని ఆయన తెలిపారు. ఆనాడు 13,500 కోట్లతో పనులు మొదలు పెట్టామని ఇప్పటివరకు 7800 కోట్లు ఖర్చు చేశామని ఆ మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఈ పంప్ హౌస్ లను వినియోగించుకొని ఖమ్మం జిల్లాలో సుమారు 7 లక్షల ఎకరాలకు, నాగార్జునసాగర్ ఆయకట్టు మూడు లక్షల ఎకరాలకు మొత్తం పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించటమే నా యొక్క మరియు ప్రజల యొక్క కోరిక అని మంత్రి తెలిపారు. ఇల్లందు నియోజకవర్గానికి కూడా గోళ్ళ పాడు నుంచి నీరు అందించడం సాధ్యం కాలేదని, అటవీ అనుమతులు లభించకపోవడం వలన సాధ్యపడలేదని తెలిపారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గోదావరి జలాలను ఇల్లందు నియోజకవర్గానికి తరలిస్తామని ఆయన అన్నారు. గోదావరి పై భాగంలో ఉన్నటువంటి ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా భద్రాచలం నియోజకవర్గానికి తాలిపేరు ప్రాజెక్టు ఉన్నప్పటికీ దుమ్ముగూడెం మండలంలోని 30 వేల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉన్నదని దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా అన్ని నియోజకవర్గాలకు నియోజకవర్గానికి కొత్తగా లక్ష ఎకరాల చొప్పున సేద్యం లోనికి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. తాగునీటి పథకానికి కూడా వైరా ప్రాజెక్టు, పాలేరు ప్రాజెక్టు ఉన్నందువల్ల సాగర్ నీరు రాకపోయినా గోదావరి జలాలతో త్రాగునీరు సాగునీరు ఆ గోదావరి తల్లి ద్వారా తీర్చుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇంజనీర్ పెద్దారెడ్డి గారి ఆధ్వర్యంలో ఈనెల లోనే ఈ మూడు పంప్ హౌస్ ల ట్రయల్ రన్ పూర్తి చేస్తామని దీని కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న అధికారులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ఏ శ్రీనివాస్ రెడ్డి, సూపరిండెంట్ ఇంజనీర్ ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే సురేష్ కుమార్ ఇతర ఇంజనీరింగ్ విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

# పేదరికం నిర్మూలన.. సంపద సృష్టి

- ఇదే ఈ ఏడాది బ్యాంకర్ల టార్గెట్
- రుణ లక్ష్యం రూ.5.40లక్షల కోట్లు
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



**టి మీడియా, జూలై 9,విజయవాడబ్యూరో :** రుణ సాయంలో రైతులకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు బ్యాంకర్లను కోరారు. సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం 227వ ఎస్ ఎల్ బీ సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం విడుదల చేసింది. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖామంత్రి కె.అచ్చెంనాయుడు, యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ రుద్ర ఎస్ ఎల్ బీ సీ కన్వీనర్ సీవీస్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకర్లు విడుదల చేసిన రుణ ప్రణాళిక వివరాలు ఇలా ఉన్నాయి. ప్రధానంగా రైతులు, కౌలు రైతులకు రుణ సాయం, ఉత్పత్తి పెరుగుదల, పేదరికం నిర్మూలన, ఉపాది అవకాశాల కల్పన, సంపదసృష్టి అంశాలపై బ్యాంకర్లతో సీఎం, మంత్రులు చర్చించారు.

**ఈ ఏడది లక్ష్యం రూ.5.40 లక్షల కోట్లు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 5,40,000 కోట్లతో రుణ ప్రణాళిక విడుదలను విడుదల చేశారు. ఇందులో రూ. 3,75,000 కోట్లు ప్రాధాన్య రంగాలకు, రూ. 1,65,000 కోట్లు ఇతర రంగాలకు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ. 2,64,000 కోట్లు రుణాలు లక్ష్యం కాగ, గతం కంటే 14 శాతం అధికంగా రుణాలు ఇవ్వాలని ఈ ప్రణాళికలో పేర్కొన్నారు. . డెయిరీ , పౌల్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ యాంత్రీకరణకు, వ్యవసాయం రంగంలో మౌళిక సదుపాయాలకు రూ. 32,600 కోట్లతో రుణ ప్రణాళికను సిద్ధం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రాధాన్యతా రంగానికి రూ. 3,23,000 కోట్లు పెట్టుకోగా%ా%ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 3,75,000 కోట్లు రుణ లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంతో పోల్చితే 16 శాతం అధికంగా రుణాల లక్ష్యం నిర్ణయించారు. వ్యవసాయ రంగానికి గత ఏడాది రూ. 2,31,000 కోట్లు రుణ లక్ష్యం కాగా అందులో 90 శాతం అనగా రూ. 2,08,136 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహద పడే ఎంఎస్ ఎంఈ రంగానికి 2023-24 ఏడాదిలో రూ. 69,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, ఈ ఏడాది ఏకంగా రూ. 87,000 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. అంటే 26 శాతం అధికంగా రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. గృహ నిర్మాణానికి రూ. 11500 కోట్లు రుణాలు ఇవ్వాలని, సాంప్రదాయేత ఇంధన సెక్టార్ కు రూ. 8000 కోట్లు రుణ ప్రణాళికను సిద్ధం చేశారు.

**ఆ అయిదు అంశాలపైనే చర్చ**

మరీ ముఖ్యం అయిదు ప్రధాన అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, బ్యాంకర్లతో సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. వ్యవసాయంలో సాగు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఖర్చులు తగ్గించడం, కౌలు రైతులకు సులభంగా రుణాలు అందించడం, మెరుగైన పంటల బీమాను అందుబాటులోకి తీసుకు రావాలని నిర్ణయం తీసుకుంది. ఇక రెండవ అంశం పేదరిక నిర్మూలనకు అవసరమైన ప్రాజెక్టులు, ప్రణాళిక చేపట్టడం, మూడవ అంశంలో .డిజిటల్ లావాదేవీల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంపై చర్చించారు. నాలుగో అంశంగా స్కిల్ డవల్మెంట్ కు చర్యలు తీసుకోవడం, అయిదవ అంశంగా .సంపద సృష్టించే, జిఎస్ డిపి పెంచే రంగాలకు తగు ప్రోత్సాహం ఇవ్వాలని మంత్రులు, బ్యాంకర్లు, ఆయా రంగాల నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

## కనుకదుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ మంత్రులు



**టి మీడియా, జూలై 9, విజయవాడ :** తెలంగాణ మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు బెజవాడ ఇంద్రకీలాద్రీపై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మను మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ ద్వారం వద్ద మేళతాళాలతో బాబు దంపతులకు వేదపండితులు స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు చేసిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కాగా, సోమవారం మంగళగిరిలో నిర్వహించిన దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సభలో మంత్రులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను కూడా ఆహ్వానించిన విషయం తెలిసిందే అందులో భాగంగా వేడకలకు హాజరైన మంత్రులు అనంతరం కనుకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.

# యువతకు ఉపాధి లేకుండా చేయడమే మోడీ లక్ష్యం

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

**టి మీడియా, జూలై 9,న్యూఢిల్లీ :** యువతకు ఉపాధి లేకుండా చేయడమే మోడీ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం ధ్వజమెత్తారు. నిరుద్యోగంపై వెలువడిన పలు సర్వేలను ఉదహరిస్తూ బిజెపి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. నిరుద్యోగంపై సిటీగ్రూప్ ఇచ్చిన స్వతంత్ర ఆర్థిక సర్వేను కూడా మోడీ ప్రభుత్వం ఖండించవచ్చని ఎద్దేవా చేశారు. అయితే ప్రభుత్వ నివేదికను ఎలా తిరస్కరిస్తారని పేర్కొన్నారు. గత పదేళ్లుగా కోట్లాది మంది యువకుల కలలను చిన్నాభిన్నం చేసిన బాధ్యత మోడీ ప్రభుత్వానిదేనన్నది నిజమని స్పష్టం చేశారు.



### భారత దేశంలో ఉపాధి పోకడలు

నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ ప్రకారం.. తయారీ రంగంలో అన్ఇన్‌కార్పోరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ వార్షిక నివేదిక ప్రకారం.. 2015-2023 మధ్య ఏడేళ్లలో చట్టబద్ధం కాని సంస్థల్లో 54 లక్షల ఉద్యోగాలు పోయాయి. 2010-11లో భారతదేశవ్యాప్తంగా 10.8 కోట్ల మంది ఉద్యోగులు తయారీ రంగంలో, వ్యవసాయేతర ఎంటర్‌ప్రైజెస్‌లో ఉద్యోగులు పనిచేశారు. 2022-23 నాటికి ఈ సంఖ్య 10.96 కోట్లకు చేరింది. అంటే 12ఏళ్లలో 16 లక్షల స్వల్ప పెరుగుదల నమోదైందని అన్నారు. పట్టణాల్లో నిరుద్యోగ రేటు ఈ ఏడాది నాలుగవ త్రైమాసికంలో 6.7 శాతంగా ఉన్నట్లు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) వెల్లడించిందని అన్నారు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) డేటాను చూపుతూ మోడీ ప్రభుత్వం అధికారిక రంగంలో ఉపాధి కల్పనకు గండికొట్టింది. అయితే డేటా వాస్తవమేనని భావించినప్పటికీ.. 2023లో కొత్త ఉద్యోగాల్లో 10 శాతం క్షీణత కనిపించిందని అన్నారు.

### నిరుద్యోగ డేటా

నిరుద్యోగం పెరుగుదల , విద్యావంతులలో అధిక నిరుద్యోగం, శ్రామిక శక్తిలో మహిళల తక్కువ భాగస్వామ్యం దేశంలో ప్రబలంగా ఉందని ప్రభుత్వ సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం ఐఐఎం లక్నో విడుదల చేసిన సర్వేలో పేర్కొంది. స్వతంత్ర ఆర్థిక నివేదికలను మోడీ ప్రభుత్వం తిరస్కరిస్తోందని, ఎందుకంటే అవి బిజెపి ప్రభుత్వ కప్పిపుచ్చుకునే సిగ్గులేని ప్రయత్నాలను బహిర్గతం చేస్తున్నాయని అన్నారు. దేశంలో ప్రస్తుత నిరుద్యోగ రేటు 9.2 శాతానికి చేరిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నివేదిక పేర్కొంది. మహిళల్లో అత్యధికంగా 18.5 శాతంగా ఉందని అన్నారు. ఐఎల్ఒ నివేదిక ప్రకారం.. దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం యువత ఉన్నారు. ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం.. 2012-2019 మధ్య సుమారు 7 కోట్ల మంది యువత శ్రామిక శక్తిలో చేరారు. కానీ ఉపాధిలో సున్నా వృద్ధి – 0.01 మాత్రమేనని ఖర్గే పేర్కొన్నారు.


### నిరుద్యోగ యువత

దేశంలోని 25 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్లలో 42.3 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని ఖర్గే 2023 అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ నివేదికను ప్రస్తావించారు. భారతదేశంలో ఏడాదికి 1.2 కోట్ల ఉద్యోగాలు అవసరం. 7 శాతం జిడిపి వృద్ధి కూడా యువతకు తగినంతగా ఉద్యోగాలను సృష్టించదు. మోడీ ప్రభుత్వ హయాంలో సగటున 5.8 శాతం జిడిపి వృద్ధి రేటును మాత్రమే సాధించిందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేదా ప్రైవేట్ సెక్టార్, స్వయం ఉపాధి లేదా అసంఘటిత రంగం ఏదైనా మోడీ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉపాధి లేకుండా చేయడమేనని ఖర్గే ఎద్దేవా చేశారు.

# శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ వసతి గృహం

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు







**టీ మీడియా ,జులై 9,ఎండపల్లి:**
మండలం కేంద్రంలోని షెడ్యూల్ కులాల ఎస్ సి హాస్టల్ శిథిలావస్థకు చేరుకుంది. పట్టించుకునే నాథుడే లేక బిక్కు బిక్కున విద్యార్థులు వేదన చెందుతున్నారు. ప్రభుత్వాలు మారినా ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు, విద్యా అధికారులు ఎవరూ పట్టించుకొనే నాథుడే లేడు, ప్రభుత్వ హాస్టల్ లొ కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండపల్లి గ్రామంలో హైస్కూల్ ప్రారంభం అయిన నాటి నుండి దూర విద్యార్థులకు గత పదిహేను సంవత్సరాలనుండి ప్రైవేట్ భవనాలె హాస్టల్ గా వున్నాయి. 1991 సంవత్సరంలో నూతనంగా ప్రారంభించిన ఎస్ సి హాస్టల్ కు 33,సంవత్సరాలు మొత్తం 48సంవత్సరాల చరిత్ర ఉంది.ఎన్నో మండలాల నుండి చదువు కోవడానికి వచ్చిన విద్యార్థులు ఈ హాస్టల్ లొ ఉండి గొప్ప గొప్ప చదువులు చదివి ఉద్యోగాలు సాధించి ఆయా రంగాలల్లో ప్రయోజకులయ్యారు. ఎంతో చరిత్ర ఉన్న ఎండపల్లి హాస్టల్, గత ప్రభుత్వంలో ఉన్న సంక్షేమ శాఖ మంత్రి ఎస్సి వర్గానికి చెందిన వ్యక్తి అయి ఉండి కూడ పట్టించుకోకుండా ఓట్ల కోసం సంఘ భవనాలు కట్టించినాడు తప్ప ఈ వసతీ గృహాన్ని ఎన్నడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో వున్నా ఎమ్మెల్యే విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ హాస్టల్ పైన దృష్టి పెట్టి కొత్త భవనాలు నిర్మించాలని గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎటుచూసిన ఊడిన తలుపులు, కిటికీలు శిథిలమైన గోడలు, పెచ్చులుడి పోయి వర్షం నీరు పడి విద్యార్థులకు ఇబ్బంది కరంగా మారింది చివరికి బాలుర వసతి గృహం బోర్డు కూడా చిలుము పట్టి దర్శనమిస్తున్నాయి. హాస్టల్ వార్డెన్ ను ఈ విషయమై వివరను కోరగా జిల్లా అధికారుల, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, గ్రామంలో ఉన్న ప్రైవేట్ భవనాలకు మారుస్తామని ప్రయత్నం చేయగా ఎవరు కూడ సహకరించడం లేదని అన్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోని హాస్టల్ ను కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు కోరుతున్నారు.

## 2026 నాటికి అందుబాటులో భోగాపురం ఎయిర్ పోర్ట్

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు




**టి మీడియా, జూలై 9,విజయనగరం:**
2026 నాటికి భోగాపురం ఎయిర్ పోర్టును అందుబాటులోకి తెస్తామని చెప్పారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. నేడు విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్ పోర్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎల్లుండి సీఎం చంద్రబాబు భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలనకు వస్తున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కూడా ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ%ొ% ఉత్తరాంధ్ర ప్రాంతానికి భోగాపురం ఎయిర్ పోర్టు గుండెకాయ వంటిదని అభివర్ణించారు. నిర్ణీత సమయంలోనే భోగాపురం విమానాశ్రయం పూర్తి చేస్తామని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టుపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయ పనులపై సీఎం చంద్రబాబు సూచనలు కూడా తీసుకుంటామని అన్నారు. కేంద్రం నుంచి ఎలాంటి అనుమతులు కావాలన్నా వెంటనే వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం విమానాశ్రయ పనులను ఆలస్యం చేసిందని ఆరోపించారు. డిసెంబరు నాటికి టెర్మినల్ భవనం పూర్తి చేస్తామని చెప్పారు. చిన్న చిన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని తెలిపారు.విమానాశ్రయం పూర్తయితే దాదాపు 6 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల వారే కాకుండా ఒడిశా వాసులకు కూడా భోగాపురం ఎయిర్ పోర్టు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకోగలిగితే, భవిష్యత్తులో ఉత్తరాంధ్రకు ఎన్నో కంపెనీలు వస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేయలేక, గడువులు పెంచుకుంటూ పోయిందని, కానీ తాము అధికారంలోకి వచ్చాక మొట్టమొదటి నెలలోనే ప్రాజెక్టును సందర్శించి, గడువు తేదీ చెబుతున్నామని, ఈ విషయాన్ని తాము ఓ బాధ్యతగా తీసుకుంటున్నామని వివరించారు.

## ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పి తుషార్ దూడి..



**టి మీడియా, జూలై 9తుళ్లూరు :**
రాజధానిఅ మరావ తిపరిధిలోని తుళ్లూరు మండలంకు సంబంధించిన లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ దూడి మంగళవారం పరిశీలించారు. అనంతరం లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ వద్ద కలెక్టర్ మాట్లాడుతూ.. తాళ్లయపాలెం, లింగాయపాలెం, గుండిమెడ, మున్నంగి, కొల్లిపర వద్ద ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చెయ్యడం జరిగిందని చెప్పారు. ఒక్క ఆధార్ కార్డు పై రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, లారీల డ్రైవర్ల సమస్యలు, రవాణా ఎలా జరుగుతుంది అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. వాహనాలలోఇసుక లోడింగ్ త్వరగా చేసేందుకు మరిన్ని యంత్రాలు ఏర్పాటు చేసేలా చూస్తామని చెప్పారు.రీచ్ నుండి ఇసుక రవాణా చేసే వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసులకు సూచించామన్నారు.ఇసుక రవాణా చేసే వాహనాలు సరైన కండిషన్ లో వున్నాయా, లేదా..తెలుసుకోవడానికి రవాణా శాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో లింగాయపాలెంలో ఇసుక లోడింగ్ చేసి కార్మికులు ఉపాధి పొందే వారని,వారికి స్టాక్ పాయింట్ లో ఇసుక తరలింపు పూర్తయ్యాక రీచ్ లలో ఇసుక తీత మొదలవుతుందని, అప్పుడు వారికి ఉపాధి కలిగేలా చూస్తామని కలెక్టర్ చెప్పారు. ఇసుక కూలీలకు ఉపాధి కలిగించేలా చూడాలని మైనింగ్ శాఖ వారికి సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీకర్, మైనింగ్,రెవెన్యూ,మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల కోరుత తో పాఠశాలకు తాళం

- టీచర్ లను నియమించాలని విద్యార్థుల ధర్నా
- అధికారులకు వినతి పత్రం

**టీ మీడియా ,జులై 9, చిన్నంబావి:**
చిన్నంబావి మండలం లోని అయ్యావారి పల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది.తక్షణమే పాఠశాల కు ఉపాధ్యాయులను కేటాయించాలని ఆ పాఠశాల విద్యార్థు లు,వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు మండల కేంద్రం లోని వాల్మీకి చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, మాట్లాడుతూ గత విద్య సంవత్సరం లో కూడా ముగ్గురు ఉపాధ్యాయులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని,ప్రస్తుత విద్యా సంవత్సరం లో 69 మంది విద్యార్థులు వుండగా ఒకటే టీచర్, ఒక పి.ఇ.టీ.టీచర్, వున్నారని,ఏడుగురు ఉపాధ్యాయులకు గాను ఐదు ఖాళీ గా వున్నాయి అని,ఉపాధ్యాయులు లేక పోతే విద్యార్థుల చదువులు సాగేది ఎట్లా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైన విద్య శాఖ అధికారులు స్పందించి సకలం లో పాఠశాల కు అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతూ ధర్నా అనంతరం విద్యార్థులు ర్యాలీగా వెళ్లి విద్య శాఖ అధికారి కి వినతి పత్రం అందజేశారు.

## జేఎన్ టీయూఇంజనీరింగ్ కళాశాలలో అడిషనల్ కలెక్టర్ తనిఖీలు



**టి మీడియా, జూలై 9,జోగిపేట:**
చౌటకూర్ మండల పరిధిలోని జేఎన్ టీ యూ ఇంజనీరింగ్ కళాశాలలోని హాస్టల్ లో సోమవారం రాత్రి విద్యార్థులకు వడ్డించే టిఫిన్ సమయంలో చట్నీ పాత్రలో చిట్టేలుక ప్రతిక్షమైంది. చట్నీ పాత్రలో ఉన్న ఎలుకను చూసి విద్యార్థులు ఆందోళన చెందారు. హాస్టల్ లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఈనెల 3న కళాశాలలో విద్యార్థులు ఆందోళన చేశారు. ఫుడ్ కాంట్రాక్టర్ ను వెంటనే మార్చాలంటూ ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్ హామీతో ఆందోళన విరవించుకున్న విద్యార్థులు తాజాగా మళ్లీ సోమవారం రాత్రి టిఫినీ సమయంలో చట్నీ పాత్రలో ఎలుక కనిపించడంతో విద్యార్థులు ఆందోళన చెందారు చట్నీ పాత్రలో చిట్టి ఎలుక అందులో తిరుగుతూ కనిపించడంతో అక్కడే ఉన్న విద్యార్థులు వారి సెల్ ఫోన్ లో వీడియోలు చిత్రికాయించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారు. దీంతో సోషల్ మీడియాలో చట్నీలో ఆ ఎలుక ప్రత్యక్షం వైరల్ గా మారింది.ఈ సంఘటన తెలుసుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి, ఆర్డీవో పాండు తో కలిసి మంగళవారం జేఎన్టీయూ కళాశాలలోని హాస్టల్ ను సందర్శించి ఫుడ్ కు సంబంధించిన వస్తువులను ఆమె పరిశీలించారు. హాస్టల్లోని వన్డే పాత్రలు, పరిశుభ్రత లేకపోవడంతో కాంట్రాక్టర్ పై ఆగ్రహ వ్యక్తం చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు వచ్చి తీరు మార్చుకోవాలని చెప్పిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కాంట్రాక్టర్ ను మార్చుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ నర్సింహాను ఆదేశించారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించారు. పూర్తి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని ఆదేశించారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

## అల్పాహారంలో బల్లి..


- పలువురు విద్యార్థులకు తీవ్ర అస్వస్థత



**టి మీడియా, జూలై 9,మెదక్:**
తెలంగాణలో హాస్టళ్ల పరిస్థితులు అధ్వానంగా మారాయి. కనీస వసతులు లేక, ఉడికి ఉడకని అన్నంతో హాస్టల్ విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల విద్యార్థులు తినే ఆహారంలో పురుగులు దర్శనమివ్వడంతో ఆందోళనకు దిగారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విద్యార్థులు జాతీయ రహదారిపై సైతం ఆందోళన చేపట్టారు. తాజాగా మెదక్ జిల్లా రామాయంపేట మండలలోని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్లో ఉదయం విద్యార్థినులకు పెట్టే టిఫిన్‌లో బల్లి పడటం కలకలం రేపింది.టిఫిన్ తిన్న 17 మంది విద్యార్థినులు వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే హాస్టల్ సిబ్బంది విద్యార్థినులను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, తాము రోజూ తినే ఆహారంలో పురుగులు వస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్స్‌లో తనిఖీలు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్పై ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలి

**టీ మీడియా, జులై 9, వనపర్తి బ్యూరో :**



దళిత ఉద్యోగులపై జరిగే ఆరాచకాలు జరగకుండా చూడాలని, అశ్వరావుపేట ఎస్సైశ్రీనివాసులు ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని దళిత ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని ఏడికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఎస్సీఎస్టీ ఉద్యోగులపై అరాచకాలు పెరినాయని, రాజ్యాంగబద్ధంగా ఉద్యోగం చేయలేని స్థితి చోటు చేసుకున్నది. ఇటీవల జరిగిన అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాసులు ఆత్మహత్యే దీనికి నిదర్శమని, అలానే జెడ్పిహెచ్ఎస్ అమరచింతలో జి. ఉపాధ్యాయునిపై రౌడీషీటర్ చేసిన అగాయిత్యాలు మనకు కన్పిస్తున్నాయి . కావున ఇక మీదట ఇటువంటి సంఘటనలు జరగకుండా రాజ్యాంగబద్ధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో గంధం నాగరాజు ఎస్సీ ఎస్టీ మోనిటరింగ్ కమిటీ సభ్యులు, వెంకటేష్ దళాత సంఘల నాయకులు, కృష్ణ, కే నిరంజన్‌య్యా, వెంకటయ్య, శ్రీనివాసులు, చెన్నకేశవులు, జే నిరంజన్‌య్యా, నాగేశ్వర్, శివశంకర్, డి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ కల్యాణంలో ప్రోటోకాల్ రగడ

గుడి బయటే మంత్రి పొన్నం, మేయర్ విజయలక్ష్మి



**టి మీడియా, జూలై 9, హైదరాబాద్:**
బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం కోసం చేసిన ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఆలయం బయటే కూర్చుండిపోయారు. కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేసిన హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్‌పై సీరియస్ అయ్యారు. వీఐపీలు వస్తున్న సమయంలో ఆలయం ఎదుట సరైన సెక్యూరిటీ లేదని మండిపడ్డారు.కొలిచిన వారి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం గణపతి పూజతో కల్యాణోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారికి ఎదుర్కోళ్లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రధాన ఘట్టమైన ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం మంగళవారం ఉదయం ప్రారంభమైంది. 11.34 నిమిషాలకు ముఖ నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తమున వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు మహాశాంతి చండీ హోమం, సాయంత్రం ఆరు గంటలకు ఎల్లమ్మ అమ్మవారిని రథంపై పురవీధుల్లో ఊరేగిస్తారు.

## తల్లిదండ్రుల రక్తాన్ని జనగల్లా తాగుతున్న ప్రైవేట్ పాఠశాలు


- జాతీయ విద్యార్థి సమైక్య



**టీ మీడియా, జులై 9,ధర్మారం:**
మండల కేంద్రంలో ని విధ్యాశాఖ అదికారి కార్యాలయంలో మండలం లోని కొన్ని ప్రైవేట్ విద్యా సమస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలోనే పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ధర్మారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జాతీయ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ మాట్లాడుతూ.కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ధనార్జనమే ధ్యేయంగా యాజమాన్యాలు భావిస్తూ పాఠశాలను సూపర్ మార్కెట్ల లాగ తయారుచేసి అంగట్లో సరుకులు అమ్మినట్లుగా పాఠశాలలోనే పుస్తకాలు, యూనిఫామ్,టై,బెల్ట్, స్టేషనరీ సామాన్లు అమ్ముతున్నారని అంతేకాకుండా పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేకుండా యాజమాన్యాలు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ డబ్బులు దోచుకోవడమే ప్రధాన లక్ష్యంగా భావిస్తూ అధిక ఫీజులు వసూలు చేసి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జనగళ్ళ తాగుతున్నారని, అవసరంలేని తరగతులు నిర్వహించి విద్యార్థుల తలకు లేనిపోని భారాన్ని మోపిస్తున్నారని కొన్ని పాఠశాలలు విద్యార్థులు మానసిక ఉల్లాసం కొరకు ఆటలాడుకోవడానికి సరైన గ్రౌండ్ కూడా లేదని, విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు అర్హత లేకున్నా వారితోనే పాఠాలు బోధిస్తున్నారని, విద్యకు చట్ట ప్రకారం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ పిల్లలకు మరియు జర్నలిస్టు పిల్లలకు ఫీజుల్లో ఎలాంటి రాయితీ కల్పించడం లేదని మరికొన్ని పాఠశాలకు సెట్ బ్యాక్ కూడా లేదని ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే దాని నివారించడానికి సరైన యంత్రాలు కూడా లేని దుస్థితి నెలకొందని,సరైన ఫిట్నెస్ లేని బస్సులతో, మినీ ఆటోలతో విద్యార్థులను పర్మితి మించి విద్యార్థులను ఎక్కించుకొని రవాణా సౌకర్యం కల్పిస్తున్నారని, పాఠశాలలో పరిమితికి మించి అడ్మిషన్లు చేస్తున్నారని, సెక్షన్లు సైతం ఏర్పాటు చేస్తున్నారని అన్నారు, అమాయకులైన తల్లిదండ్రులను ఆసరాగా చేసుకొని వారి జీవితాలతో ఆడుకుంటూ వారి దగ్గర నుంచి అధిక మొత్తంలో దోచుకుంటున్నారని అన్నారు, ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనల విరుద్ధంగా నడుస్తున్నటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకొని యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం జేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ రెహమాన్,ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## 14 ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేశాం

- పతంజలి ఆయుర్వేద సంస్థ



**టి మీడియా, జూలై 9,న్యూఢిల్లీ :**
తయారీ లైసెన్సులు రద్దు చేసిన 14 ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేసినట్లు పతంజలి మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉత్తరాఖండ్ ప్రభుత్వం (లైసెన్సింగ్ అథారిటీ) 14 ఉత్పత్తుల లైసెన్స్‌లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. 5,606 ఫ్రాంచైజీల నుండి ఆ ఉత్పత్తులను వెనక్కి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు పతంజలి ఆయుర్వేద సంస్థ తెలిపింది. ప్రకటనలను కూడా నిలిపివేయాల్సిందిగా మీడియా సంస్థలను కోరామని పేర్కొంది.ప్రకటనల తొలగింపు కోసం సోషల్ మీడియా మధ్యవర్తులకు చేసిన అభ్యర్థన ఆమోదించబడిందా, ఈ 14 ఉత్పత్తుల ప్రకటనలను ఉపసంహరించుకున్నారా అనే అంశాలపై రెండు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని పతంజలి సంస్థను జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్వి సభ్య ధర్మాసనం ఆదేశించింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

## ఐఐటి విద్యార్థికి లాప్ టాప్ బహుకరణ

ఎతూడి ఇన్ ఫ్రా మేనేజింగ్ పార్ట్నర్ శ్రీనివాసరెడ్డి



**టీ మీడియా, జులై 9, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరావిబాకుల గ్రామానికి చెందిన జలగం భద్రయ్య కుమారుడు జలగం సాయి రుషీత్ కాన్పూర్ ఐఐటి లో సీటు సంపాదించారు.నిరుపేద కుటుంబానికి చెందిన సాయి రిషిత్ కు పెద్దమందడి మండలం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, తూడి ఇన్ ఫ్రా మేనేజింగ్ పార్ట్నర్ శ్రీనివాస్ రెడ్డి ల్యాప్టాప్ ను బహుకరించారు.ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థికి సూచించారు.

## కాంగ్రెస్ పార్టీతో మహిళలకు అన్యాయం



**టీ మీడియా జులై 9 గోదావరిఖని ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో మహిళలకు అన్యాయం జరిగిందని భాజపా రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు శిల్పారెడ్డి అన్నారు. హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద జరిగిన నారీ బేరి ధర్నా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమ పథకాల్లో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మహిళా మోర్చా సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరు

- టియుడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్

**టీ మీడియా, జులై 9, వనపర్తి బ్యూరో :**
జర్నలిస్టు వృత్తి పవిత్రమైనది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరు,జర్నలిస్టులు మానవతా విలువలు పెంపొందించుకోవాలనీ తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు యూనియన్(టీయూడబ్ల్యూజె) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అన్నారు. టీయూడబ్ల్యూజె (ఐజెయూ) వనపర్తి జిల్లా, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు అధ్యక్షతన వనపర్తి పట్టణంలోని తరుని ఫంక్షన్ హాల్లో నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మధుగౌడ్ కు అభినందన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహిత మధు గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులు మానవీయ కోణంలో వార్తలు రాస్తే తగిన గుర్తింపు వస్తుందన్నారు.తొలిసారిగా వనపర్తి జిల్లాకు రాష్ట్ర పదవి దక్కిందని ఆ పదవికి వన్నె తెచ్చే విధంగా జర్నలిస్టులకు సేవలందిస్తూనే ఉంటానని అన్నారు. తాను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు సహకరించిన యూనియన్ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రామ్ నారాయణ లకు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సహకారంతో తాను ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. త్వరలో ప్రెస్ అకాడమీ నుంచి జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించే జీవో రాబోతుందని ఆ పనులు వేగవంతం అవుతున్నాయనీ అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాగర్ కర్నూల్ జిల్లా ఇన్చార్జి శ్యామ్, వనపర్తి జిల్లా కార్యదర్శి మాధవ్, జాతీయ కౌన్సిల్ సభ్యుడుప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రమేష్, సీనియర్ పాత్రికేయులు ఉషన్న, పొర్లరెడ్డి, బి.రాజు, ఖలీల్ ఎల్ల గౌడ్, సాహితీ కళావేదిక కన్వీనర్ పలుస శంకర్ గౌడ్, గంధం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మహిళా కన్వీనర్ ధనలక్ష్మి వాల్మీకి సంఘం నాయకులు రాములు, పట్టణ, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, ధ్యారపోగు మన్యం, జర్నలిస్ట్ నాయకులు భాస్కర్, దినేష్, కుమార్, విజయ్, నా కొండ,జిల్లా ఉర్దూ పత్రికలు, మహ్మద్కమల్,ఎండి షఫీ,ఎండి షీరాజ్,నశిరొద్దీన్, ఎం ఏ సలాం, అబ్దుల్ వహిద్గోపాల్ జిల్లా ఫోటో జర్నలిస్టులు ఎస్.వి రమేష్, రాము,యాదిరెడ్డి,శ్రీకాంత్వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## వరద నీటి కోసం ముందస్తు చర్యలు చేపట్టిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటీ శ్రీధర్




**టీ మీడియా, జులై 9, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని 30వ వార్డులోని రాజీవ్ గృహకల్ప, జంగిడిపురం, ఐజయ్య కాలనీ, న్యూటన్ కాలనీలో వరద నీటి కాలువను సోమవారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ 30 వార్డ్ కౌన్సిలర్ వాకిటి శ్రీధర్ మున్సిపల్ జెసిబి తో కంప చెట్లను తొలగించి పేరుకుపోయిన చెత్తను తొలగించడం జరిగింది.ఈ సందర్భంగా వాటికి శ్రీధర్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వరద నీటి కాలువలను తీయించి ముందు జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను కోరారు. వర్షాలు రావడంతో కాలువ నుండి ఇండ్లలోకి నీరు వచ్చే ప్రమాదాన్ని ముందే పసిగట్టి ఈ చర్యలు చేపట్టాలని కోరారు. వర్షాకాలం స్టార్ట్ అయ్యి పది రోజులైనా అధికారులు మున్సిపల్ పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్టు ఉందని ఈ సందర్భంగా అన్నారు. ఇప్పటికైనా మేలుకొని అన్ని వరదనీటి కాలువలను శిల్టులను తొలగించే ప్రక్రియ వేగంగా తీసుకెళ్లాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్లకు అర్హుల జాబితాను సిద్ధం చేయండి

-మంత్రి సీతక్క



**టి మీడియా, జూలై 9, హైదరాబాద్ :** తెలంగాణలో కొత్త పింఛన్ల జారీకి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ లో ఉన్నవి, కొత్త ప్రభుత్వం వచ్చాక అందిన దరఖాస్తుల ఆధారంగా రిపోర్ట్ చేయాలని ఉన్నత స్థాయి సమీక్షలో సూచించారు. చేయూత పథకం కింద పింఛన్ల మొత్తాన్ని పెంచుతామని తెలిపారు.గత ప్రభుత్వం పొదుపు సొమ్మును పక్కదారి పట్టించిందని,ఆ వివరాలను ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు.

# పెద్దపల్లి టూ ఫారిన్



- తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకూ సప్లయ్?
- పెద్దపల్లి రాఖీలకు పెద్ద ఎత్తున ఆర్డర్లు ?
- 43 వేల రకాల్లో తయారీ

**టీ మీడియా, జూలై 9,పెద్దపల్లిబ్యూరో :**

రక్షాబంధన్.. అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్లు.. సంబరంగా జరుపుకునే పండగ. ఆత్మీయత అనురాగాలను ప్రస్ఫుటం చేసేందుకు చిహ్నం రాఖీ. ఎవరి స్థాయి బట్టి వారు రాఖీలను కొనుగోలు చేస్తారు. రకరకాల రాఖీలు కొనడానికి ఆడ పిల్లలు ఆసక్తి చూపుతారు. అయితే.. ఎంతో చూడముచ్చటైన రాఖీలు తెలంగాణలోని పెద్దపల్లిలో తయారు చేస్తున్నారంటే నమ్మరేమో. అవును.. ఇక్కడ తయారయ్యే రాఖీలకు పెద్ద ఎత్తున డిమాండ్? ఉంది. తక్కువ ధర, అనేక రకాల రాఖీలు ఉండడంతో ఆర్డర్లమీద ఆర్డర్లు వస్తున్నాయి. అందుకే.. ఇక్కడి నుంచి విదేశాలకు కూడా రాఖీలను ఎగుమతి చేస్తున్నారు.

### పదేళ్ల క్రితం వరకు..

రక్షాబంధన్ వచ్చిందంటే రాఖీలకు గిరాకీ పెరుగుతుంది. పదేళ్ల క్రితం వరకూ కోల్?కతా, రాజస్థాన్ నుంచి రాఖీలు దిగుమతి అయ్యేవి. అక్కడి డీలర్లు ఎంత ధర చెప్తే.. అంతకు కొనాల్సిన పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం మన దగ్గరే రాఖీలు తయారు చేస్తుండడంతో ధరల కోసం డిమాండ్? చేయాల్సిన పరిస్థితి లేదు. అతి తక్కువ ధరకే పెద్దపల్లిలోని తయారవుతున్న అనేక రకాల రాఖీలు రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి.

### దేశవిదేశాల్లో పెద్దపల్లి రాఖీల విక్రయం

ఏపీ, తెలంగాణాలో రాఖీలు తయారు చేసే ఏకైక కేంద్రం పెద్దపల్లి కావడంతో డిమాండ్? కూడా అదే స్థాయిలో ఉంది. తొమ్మిదేళ్ల కిందట పెద్దపల్లిలోని ఎస్ఆర్ఆర్ రాఖీ తయారీ కేంద్రాన్ని ఇల్లందుల కృష్ణమూర్తి ఏర్పాటు చేశారు. అనేక డిజైన్లలో తయారీ చేసి విక్రయిస్తున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో రాఖీలు ఇక్కడ మాత్రమే తయారు చేస్తున్నారు. ఇక్కడి నుంచి రెండు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. అలాగే ఛత్తీస్?గఢ్?, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతోపాటు అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా దేశాలకు పెద్దపల్లిలో తయారైన రాఖీలు సరఫరా అవుతున్నాయి. లండన్లోని ఎస్.మార్ట్లో ఎస్ఆర్ఆర్ రాఖీలను విక్రయిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి పెద్దపల్లికి రాఖీల కోసం వ్యాపారులు వస్తుంటారు.

### పది పైసల నుంచి..

ఇక్కడ తయారు అవుతున్న రాఖీలు పది పైసల నుంచి ?400 ధరకు లభిస్తున్నాయి. సుమారు 43 వేల రకాల రాఖీలను తయారు చేసి విక్రయిస్తున్నారు. బార్ కోడింగ్ పద్ధతిలో బిల్లింగ్ చేస్తున్నారు. హైదరాబాద్లోని దుకాణాల్లో విక్రయించేందుకు ఈ ఏడాది పెద్ద ఎత్తున అక్కడి వ్యాపారులు పెద్దపల్లి రాఖీలను కొనుగోలు చేశారు. గతంలో ?10కి దొరికే రాఖీలు ప్రస్తుతం ?2కే దొరుకుతున్నాయి.

### 2000 మందికి ఉపాధి

పెద్దపల్లి కేంద్రంగా తయారవుతున్న రాఖీల వల్ల సుమారు రెండు వేల మందికి ఉపాధి లభిస్తోంది. ఒక్కో మహిళ రోజుకు ?300 నుండి ?750 వరకు సంపాదిస్తున్నారు. ఒక చిన్న పరిశ్రమలా రాఖీలను ఉత్పత్తి చేస్తున్నారు.

### ధర తగ్గింది.. ఉపాధి పెరిగింది

పెద్దపల్లిలో రాఖీ తయారీ కేంద్రం నెలకొల్పడంతో గతంలో కంటే 80 శాతం ధరలు తగ్గాయి. ఎస్ఆర్ఆర్ సీజన్ సెంటర్లో హోల్సేల్, రిటైల్లో రాఖీలు విక్రయిస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి ముడిసరుకులు తీసుకువచ్చి రాఖీలు తయారు చేయడంతో ఈ ప్రాంతంలోని మూడు వేల మందికిపైగా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. జనవరి నుంచి ఆగస్టు వరకు 8 నెలలపాటు ఇట్లా ఉపాధి అవకాశాలు ఉంటాయి. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెల్లలో మహిళలకు రాఖీల తయారీపై ఉచిత శిక్షణ ఇప్పిస్తాం. గతంలో కలకత్తా నుంచి తెచ్చి రాఖీలను విక్రయించే వాళ్లం. ఇప్పుడు 12 రాష్ట్రాలకు సరఫరా చేస్తుండడం సంతోషంగా ఉంది. రాబోయే ఏడాది దేశంలోని 29 రాష్ట్రాలకు రాఖీలను సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం.



## మాజీ జెడ్పిటిసి కి సన్మానం

**టీ మీడియా, జూలై 9, గోదావరిఖని ప్రతినిధి:**



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జడ్పిటిసి సభ్యురాలు కందుల సంధ్యారాణికి పదవి బాధ్యతలు ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాలకుర్తి రైతు వేదికలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి, మంగళవారం మండల పరిషత్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి కందుల సంధ్యారాణి మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు అందించిన సహకారం మరువలేనిది అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా పాలకుర్తి జడ్పిటిసిగా మండలానికి చేసిన సేవలను గుర్తు చేశారు. రానున్న రోజుల్లో పదవులు ఉన్నా లేకున్నా ప్రజలకు వారి సేవలను అందించడం జరుగుతుందని అన్నారు. పాలకుర్తి మండల ప్రజ ఆశీర్వాదంతోనే ఈ స్థాయిలో ఉన్నానని అన్నారు. నేటితో వారి బాధ్యత అయిపోయిలేదని ప్రజలందరి ప్రతి సమస్యలో నేను ఉంటానని తెలిపారు. మండల ప్రజల సహకారంతోనే ఈ మండలానికి సేవ చేసే భాగ్యం కలిగిందని, మండల ప్రజలందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీ ఓ షబ్బీర్ అలీ, ఏఈ శ్రీనివాస్, ఏపీఎం సదానందం, ఏపీవో కొమురయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్, విజయ, సుమిత్ర కార్యదర్శులు,మండల అధికారులు పాల్గొన్నారు.

## స్పందించిన కార్పొరేటర్... వెలిగిన వీధి దీపాలు

**టీ మీడియా,జులై 9,గోదావరిఖని ప్రతినిధి:**



రామగుండం కార్పొరేషన్ పరిధి 33వ డివిజన్లో కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ సౌజన్యంతో సౌర విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా దొంత శ్రీనివాస్ మాట్లాడుతూ రాత్రి సమయంలో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవద్దని వెంటనే మరమ్మతులు చేపట్టాలని వీధి దీపాలను ఏర్పాటుకు ముందుకు వచ్చారు. సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి సౌర విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రామగుండం కార్పొరేషన్ లోనే 33 వ డివిజన్లో ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దడం కోసం సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకుపోయి ప్రత్యేక నిధులు కేటాయించాలని, డివిజన్ ప్రజల పక్షాన కోరామని తెలిపారు. వీధిదీపాలన ఏర్పాటుకు సహకరించిన సింగరేణి యాజమాన్యానికి, సిబ్బందికి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ కు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

## బొగ్గు గనుల వేలం నిలిపివేయాలి


**టీ మీడియా, జులై 9, గోదావరిఖని ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం వేలం రద్దుచేసి సింగరేణికి అప్పగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం ఆర్జీ -1ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను ప్రైవేటు వారికి అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ, ఏఐటీయూసీ లు పోరాట కార్యక్రమాలు చేపట్టారు. గత కొన్ని రోజుల క్రితం కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయడం జరిగిందని, ఆ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 8 నుంచి 12 వరకు సింగరేణి వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గత సోమవారం హైదరాబాదులో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మూడు జాతీయ సంఘాల నాయకులు కలిసి తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను సింగరేణికి ఇవ్వాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. కేంద్ర మంత్రితో జరిగిన చర్చల్లో సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల విధానాల వల్ల ఆర్థిక దోపిడీ జరిగిందని ఆలోచనతో ఎం ఎం డి ఆర్ చట్టంలో మార్పు చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఈనెల 10న అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని, ఈనెల 17న హైదరాబాదులో వేలం వేసే కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమాన్ని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## పంజాబ్, హర్యానా హైకోర్టు

**ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ నాగు**

**టి మీడియా, జూలై 9,చండీగఢ్ :**



పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ షీల్ నాగు ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం ఉదయం పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ ఆయనతో ప్రమాణం చేయించారు. రాజ్భవన్లో జరిగిన ఈ కార్యక్రమానికి పంజాబ్ సిఎం భగవంత్ మాన్, హర్యానా సిఎం నయాబ్ సింగ్ సైనీ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యారు.జస్టిస్ నాగు గతంలో మధ్యప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. కొద్ది రోజుల క్రితం ఆయన పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్, హర్యానా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రవిశంకర్ ఝూ పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టు కొలీజియం గతేడాది డిసెంబర్ 27న జస్టిస్ నాగు పేరును సిఫారసు చేసిన సంగతి తెలిసిందే.

## కిడ్నీ కొట్టేసిన ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి

**హోంమంత్రి అనిత**

**టి మీడియా, జూలై 9,విజయవాడ:**




విజయవాడలో కిడ్నీ రాకెట్ వ్యవహారంపై హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు కలెక్టర్, ఎస్పీ, విజయవాడ సీపీతో ఆమె ఫోన్లో మాట్లాడారు. డబ్బులు ఆశ చూపి కిడ్నీ కొట్టేసిన ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు నిఘా పెట్టాలని చెప్పారు. బాధితుడి ఫిర్యాదుపై హోంమంత్రి ఆదేశాలతో పోలీసులు విచారణ చేపట్టారు.విజయవాడ కేంద్రంగా ఇటీవల కిడ్నీ రాకెట్ ముఠా మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థిక ఇబ్బందులతో కిడ్నీ విక్రయానికి అంగీకరిస్తే.. కిడ్నీ తీసుకున్న తర్వాత డబ్బులు ఇవ్వకుండా తనను మోసం చేశారని గుంటూరు జిల్లా కొండా వెంకటప్పటయ్యకాలనీకి చెందిన బాధితుడు మధుబాబు వాపోయారు. ఈ మేరకు సోమవారం గుంటూరు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

## ముంబైలో భారీ వర్షాలు

**రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండి**

**టి మీడియా, జూలై 9,ముంబై :**



ముంబైని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. సోమవారం కురిసిన వర్షానికే నగరంలో రోడ్లన్నీ నదుల్ని తలపిస్తున్నాయి. ఇక మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ (ఐఎండి) అంచనా వేసింది. దీంతో ముంబైకి ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండి హెచ్చరికలు మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు. ముంబై, థానే, నవీ బుంబై, పన్వెల్, పూణెతోపాటు రత్నగిరిసింధుదుర్గ్లోని గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలకు అధికారులు మంగళవారం సెలవు ప్రకటించారు.అలాగే వర్షం కారణంగా ముంబై యూనివర్సిటీలో ఈరోజు జరగాల్సిన అన్ని పరీక్షలు వాయిదాపడ్డాయి.కాగా, ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున వరకు ముంబైలో భారీ వర్షం కురిసింది. ఏడు గంటల వ్యవధిలోనే సుమారు 300 మిల్లీమీటర్లకుపైనే వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ఎన్నో అవస్థలు పడ్డారు. బైకులు, కార్లు పలు వాహనాలు నీటిపై తేలియాడాయి.

## వంద కాల్స్ కి తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవాలి

- సైబర్ మోసాల పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి

**టీ మీడియా, జులై 9, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి మంగళవారం ఆకస్మికంగా మదనపూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నందు గల రికార్డులను, ఫైల్స్ ను పరిశీలించారు సిసిటీఎన్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ప్రతి గ్రామంలో కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి కావున ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని పీస్ సిబ్బంది అందరూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై పై ఎక్కువ దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.
ఎస్ఐ శేఖరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**టి మీడియా, జూలై 9, తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది.ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ ఈవో శ్రీ జె శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ, సంవత్సరంలో నాలుగుసార్లు అనగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.ఈ కార్యక్రమంలో జేఈఓ శ్రీ వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్వో శ్రీ నరసింహ కిషోర్, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ల్లో సీనియర్ టీచర్లకు న్యాయం చేయాలి

**-టీఎస్ యుటీఎఫ్**



**టి మీడియా, జూలై 9, హైదరాబాద్ :** సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో అవసరానికి మించి ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని పేర్కొంటూ సొసైటీ కార్యదర్శి సీనియర్ ఉపాధ్యాయులను అదనపు ఉపాధ్యాయులుగా గుర్తించి హడావుడిగా బదిలీకి ఆదేశాలివ్వడాన్ని టీఎస్ యుటీఎఫ్ తీవ్రంగా ఖండించింది.రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం అదనపు ఉపాధ్యాయులను బదిలీ చేయాల్సిన సందర్భంలో సీనియర్ల అంగీకారం తీసుకోవాలి. బలవంతంగా బదిలీ చేయాల్సి వస్తే జూనియర్లను మాత్రమే బదిలీ చేయాలి. కానీ ఏకపక్షంగా రాత్రికి రాత్రే సీనియర్ టీచర్లతో లిస్ట్ విడుదల చేసి తెల్లవారేసరికి కౌన్సిలింగ్కు రమ్మని పిలవటం సమంజసంగా లేదు. అదనపు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే సందర్భంలో రీ డిప్లాయ్మెంట్ నిబంధనలు పాటించి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.వివిధ జిల్లాల నుండి వచ్చిన బాధిత ఉపాధ్యాయులు మంగళవారం మధ్యాహ్నం సేవాలాల్ బంజారాభవన్ వద్ద మెరుపు ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు. వారి ఆందోళనకు టిఎస్ యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కే జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు.

## ఇంటి స్థలంతోపాటు, ప్రభుత్వ ఉద్యోగం

**-సిరాజ్కు ఊహించని సర్ప్రైజ్ ఇచ్చిన సీఎం రేవంత్.**



**టి మీడియా, జూలై 9, హైదరాబాద్:** టీమిండియా పేసర్ మహమ్మద్ సిరాజ్ తెలంగాణ ముఖ్యమమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. టీ20 ప్రపంచ కప్ సాధించినందుకు సిరాజ్ను సీఎం అభినందించారు. ఆ తర్వాత సిరాజ్ టీమిండియా జెర్సీని సీఎం రేవంత్ రెడ్డికి బహుకరించాడు. కాగా, ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డితో పాటు మంత్రి కోమటి రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, టీమిండియా మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. సిరాజ్ మియాకు హైదరాబాద్లో ఇంటిస్థలంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈమేరకు స్థలం చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఇటీవల, టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచ కప్ విజయం తర్వాత హైదరాబాద్లో అడుగుపెట్టిన భారత పేసర్ మహ్మద్ సిరాజ్కు హైదరాబాద్లో క్రికెట్ అభిమానుల నుంచి ఘన స్వాగతం లభించింది. బాణసంచా కాల్చడంతో దేశభక్తి గీతాలతో అభిమానులు 30 ఏళ్ల హైదరాబాద్ పేసర్కు స్వాగతం పలికారు.

## చిరుత పులి దాడిలో యువకుడికి స్వల్ప గాయాలు

**-భయం గుప్పిట్లో ప్రజలు..**





**టీ మీడియా, జూలై 9, మహానంది:** మహానంది మండలంలోని గ్రామాల ప్రజలు గత నెల రోజులుగా చిరుత పేరు వింటే హడలిపోతున్న పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో గాని తెల్లవారుజామున గాని చిరుత పులి ఎక్కడ దాడి చేస్తిందో అని, గ్రామస్తులు బిక్కుబిక్కుమంటు జీవనం సాగిస్తున్న పరిస్థితి. చిరుత పులి దాడిలో యువకుడికి స్వల్ప గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మహానందిలోని ఈశ్వర్ నగర్ కాలనీ సమీపంలోని, చెంచు గూడానికి చెందిన నాగన్న అనే యువకుడు బహర్భూమికి వెళ్ళగా, వెనుక వైపు నుంచి చిరుత పులి దాడి చేసిందని తెలిపారు. వెంటనే నాగన్న అప్రమత్తమై,భయపడి కేకలు వేయడంతో పారిపోయిందని తెలిపారు. దీంతో చెంచు గూడెంలోని ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులు ఎవరికో ఒకరికి ప్రాణ నష్టం జరిగితే గాని స్పందించరా, అని ప్రజలు వాపోతున్నారు.చిరుత సంచారంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు.ఫారెస్ట్ అధికారులు పులిని బంధించడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారో, అని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ ఉన్నత అధికారులు స్పందించి, చిరుత పులిని బంధించాలని కోరుతున్నారు




## కార్యక్రమాలను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి

**-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

**టి మీడియా, జూలై 9, హైదరాబాద్:** ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. . వన మహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాల నిర్వహణ, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, వానా కాలం పంటల సాగు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం, ఉద్యోగుల సాధారణ బదిలీలు వంటి పలు అంశాలను సీఎస్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, వన మహోత్సవం కార్యక్రమం క్రింద నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. జిల్లాలలో పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్ లలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గతంలో నాటిన మొక్కలలో చనిపోయిన మొక్కలను రిప్లేస్ చేయాలని అన్నారు. ఇంటింటికి పంపిణీ చేసే మొక్కల పెంపకం, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, క్యాంటీన్లు, మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయు నూతన మీ సేవా కేంద్రాలలో వీలైనంత మేర మహిళా సంఘాల సభ్యులచే ఏర్పాటు చేయాలని, ఆసక్తి, అర్హత గల మహిళల గుర్తింపు, వారికి శిక్షణ, బ్యాంకు లింకేజ్ రుణం వంటి అంశాలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని సిఎస్ అన్నారు. జిల్లాలో ప్రముఖమైన ప్రదేశాలలో మహిళా సంఘాలచే అమ్మ క్యాంటీన్ లను ఏర్పాటు చేయాలని, మహిళా శక్తి క్రింద ఇతర వినూత్న కార్యక్రమాలను అమలు చేసేందుకు సలహాలు, సూచనలు ఉంటే ప్రభుత్వానికి అందజేయాలని సిఎస్ తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణ లక్ష్యాలను పూర్తి చేయాలని, ఆ రుణాలతో మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా అవసరమైన కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి చివరి దశ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సీఎస్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి రెండవ జత ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ పూర్తి చేయాలని అన్నారు.వానాకాలం ప్రారంభమై వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంటల సాగు పెరుగుతుందని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు. విత్తనాల లభ్యత అంశాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని అన్నారు. రైతు భరోసా వర్క్ షాప్ లను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా కేసుల వ్యాప్తి అరికట్టాలని, స్థానిక సంస్థల అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామాలు, పట్టణాలలో రెగ్యులర్ గా ఫాగింగ్ నిర్వహించాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని అన్నారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లా స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఉత్తర్వులు నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, వన మహోత్సవం క్రింద జిల్లాలో మొక్కలు నాటుతున్నట్లు, నేషనల్ హైవే, కెనాల్ బండ్ ల వద్ద మొక్కలు నాటుటకు కార్యాచరణ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల క్రింద జిల్లాలో 50 పాఠశాలలు గుర్తించి మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. వారంలోగా లక్ష్యం మేరకు మొక్కలు నాటడం పూర్తి చేయనున్నట్లు ఆయన అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ ల తర్వాత మాల్ లతో టై అప్ చేసి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగంగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కు హాట్ స్పాట్ లు గుర్తించి ముందస్తుగా కట్టడి చేస్తున్నట్లు తెలిపారు. మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు ఆయన అన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేసినట్లు ఆయన అన్నారు. బదిలీలు నిబంధనల మేరకు పారదర్శకంగా చేపట్టి పూర్తి చేస్తామన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

**టి మీడియా, జూలై 9, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రదేశాలలో మెరుపులతో కూడిన ఉరుములు, ఈదురు గాలులు (30-40 కెఎమ్పిహెచ్) కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్లోని మొత్తం ఆరు జోన్లలో వచ్చే ఐదు రోజుల్లో సాధారణంగా మేఘావఅతమైన ఆకాశం , తేలికపాటి నుండి మోస్తరు వర్షం , ఉరుములు మెరుపులు , ఈదురు గాలులు (30-40 కెఎమ్పిహెచ్) తో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎమ్డి తన సూచనలో తెలిపింది. కోస్తా తీరం మీదుగా కొనసాగుతున్న ఆవర్తనం కారణంగా.. మంగళశారం ఏపీలో పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, సత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది.

